క్లుప్తంగా

మెనూలో నాణ్యత తప్పనిసరి

హనుమంతునిపాడు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పక పాటించాలని పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వంటశాలను పరిశీలించారు. వంట చేసిన తరువాత పాత్రలపై మూతలు ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు.

కేజీబీవీకి ఇన్వర్టర్ బహూకరణ

పీసీపల్లి: స్థానిక కేజీబీవీ పాఠశాలకు మాదాపు రమేష్ రూ.41 వేల విలువైన ఇన్వర్టర్‌ను ప్రిన్సిపాల్ సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ మల్లేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కొండపి (సింగరాయకొండ): ప్రజల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి, బాలకోటయ్య, లక్ష్మీ, ప్రభాకర్, బాలాజీ, నాయకులు స్వాములు, అంకయ్య, అంజయ్య, సాయి, ప్రసాదుతదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

వెలిగండ్ల: వరద బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వెలిగండ్లలో విరాళాలు సేకరించారు. వెలిగండ్లలో ప్రజలు, దుకాణాల నుంచి రూ.4,055 సేకరించారు. నాయకులు రాయళ్ల మాలకొండయ్య, పత్తిపాటి యానాదిరావు, అయినకోట రంగస్వామి, కారంపూడి నాగేశ్వరరావు, చక్రీరావులు పాల్గొన్నారు.

హోటల్స్ యజమానులు రూ.50 వేల సాయం

కందుకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్‌ల యజమానులు తమ అసోసియేషన్ తరపున రూ. 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. వీరిలో సూర్య బార్ అండ్ రెస్టారెండ్ అధినేత పిడికిటి వెంకటేశ్వర్లు, ఆదిత్య గ్రాండ్ అధినేత మద్రిపూడి శ్రీను, శ్రీకృష్ణ గెస్టు రూమ్స్ అధినేత బక్కమంతుల శ్రీనివాసరావులు ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున, సరయు హోటల్ అధినేత ఘట్టమనేని శ్రీనివాస్ రూ. 7 వేలు, స్వర్ణ ప్యాలెస్ అధినేత డబ్బుకొట్టు మల్లికార్జున రూ.5 వేలు, న్యూ వుడ్‌ల్యాండ్ అధినేత కలికివాయి కృష్ణ రూ.8 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక


ఎస్‌కే దస్తగిరి


ముక్కు నాసరెడ్డి


పి.జైనాబి


యాతం శ్రీనివాసరావు


తిరుపతయ్య


జి.మాల్యాద్రి

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాతం శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

వెలిగండ్ల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని గన్నవరంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రేగలగడ్డ తిరుపతయ్య జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

కనిగిరి రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కనిగిరి మండలాలనికి చెందిన నల్గురు ఎంపికైనట్లు ఎంఈఓ యువీ నారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని పాలూరి వారిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు ఎస్‌కే దస్తగిరి, పునుగోడు పాఠశాలకు ఉపాధ్యాయుడు ముక్కు నాసరెడ్డి, పట్టణంలోని 3వ వార్డు పాఠశాలకు చెందిన పి. జైనాబిలు ఎంపికైయ్యారు. వీరు ఈ నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా ఒంగోలులో ప్రశంసాపత్రం, పురస్కరాన్ని అందుకోనున్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.మాల్యాద్రి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికయ్యారు. నెల్లూరులో గురువారం జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఎంపికైన ప్రధానోపాధ్యాయుడిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

కొండయ్య చౌదరి విగ్రహ ధ్వంసం దారుణం

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


కాకుటూరివారిపాలెంలో కొండయ్య చౌదరి విగ్రహం ధ్వంసం చేసిన దృశ్యం

సింగరాయకొండ: టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం మాజీ సర్పంచ్ తొట్టెంపూడి కొండయ్య చౌదరి విగ్రహం ధ్వంసం చేసిన ఆగంతులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. గ్రామానికి 35 ఏళ్ల పాటు సర్పంచ్‌గా ఉన్న వ్యక్తి విగ్రహాన్ని గౌరవ భావంతో గ్రామస్తులు ఏర్పాటు చేసుకుంటే కొంతమంది దుండగులు ఆ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా టీడీపీ నాయకులు ఇంకా కక్ష్య సాధింపు చర్యలు మానలేదని, గ్రామాల్లో ఇంకా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు పద్ధతి మార్చుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

హలో మాల..చలో ఒంగోలును జయప్రదం చేయండి


ప్రచార సభ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న పుల్లయ్య

టంగుటూరు: రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించి, రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న ఒంగోలులో జరిగే హలో మాల..ఛలో ఒంగోలును జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు అన్నారు. స్థానిక మాల ఉద్యోగుల సంఘ కార్యాలయంలో అధ్యక్షుడ తుల్లి బిల్లి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఒంగోలు నెల్లూరు బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగే సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పౌష్టికాహార ఆవశ్యకతను గుర్తించాలి


పౌష్టికాహార ఆవశ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

సీఎస్‌పురం(పామూరు): పౌష్టికాహార ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. సీఎస్‌పురం 2వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కృపావరం మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, ఇతర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. బిడ్డల ఎదుగుదల్లో మార్పులను తల్లులు గుర్తించాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


క్రీడలను పరిశీలిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

సీఎస్‌పురం(పామూరు): పీఎంశ్రీ కింద ఎన్నికైన పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి చేయనున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలాన్ని బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత ఏడాది పీఎంశ్రీ ద్వారా విడుదలై రూ.లక్ష నిధులతో పాఠశాల ఆటస్థలాన్ని అభివృద్ధి చేశామని, ఈ ఏడాది మరో రూ.లక్ష నిధులు మంజూరయ్యాయన్నారు. రెండో విడత వచ్చిన నిధులతో గ్రంథాలయ ఏర్పాటు, భౌతికశాస్త్ర లేబోరేటరీ, తాగునీటి వసతి, శానిటేషన్, మరుగుదొడ్ల వసతి కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వచ్చే వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగంకు సూచించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరం


కంది విత్తనశుద్ధిపై రైతులకు వివరిస్తున్న ఏఓ రాధ

పామూరు: రైతులు కందిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని దూబగుంట్ల రైతుసేవా కేంద్రం పరిధిలోని వెంకటాపురంలో బుధవారం కందిపంట సాగుపై పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా కందిలో రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులైన విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కేజీ కంది విత్తనాల్లో 10 గ్రాముల చొప్పున ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఎండుతెగులు బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని వివరించారు. కందిని వివిధ దశల్లో ఆశించే తెగుళ్ళ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్సై షేక్ మహబూబ్ సుభానీ స్వాధీన పర్చుకున్నారు. బుధవారం తెల్లవారు జామున ఇసుక ట్రాక్టర్లు తరలి వెళ్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు


నేత్రదానికి అంగీకార పత్రాలు అందజేస్తున్న దాతలు

కందుకూరు: మరణించిన తర్వాత నేత్రదానం చేస్తే అంధత్వంతో బాధపడుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపినవారు అవుతారని ప్రభుత్వ ఏరియా వైద్యశాల కంటి వైద్యనిపుణురాలు సౌమ్య స్రవంతి అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో జరిగిన పక్షోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ప్రపంచంలో ఉన్న అందుల్లో 4వ వంతు ఒక్క భారతదేశంలోనే ఉండటం దురదృష్టకరమన్నారు. ఇటువంటి వారికి చూపు తెప్పించేందుకు మరణించిన వారి నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని, దీని కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 30 మంది నేత్రదానం చేసేందుకు తమ అంగీకార పత్రాలు అందజేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఇంద్రాణి, వెంకటరెడ్డి, కళ్యాణ్, ఆశావర్కర్ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ పొంగళ్లు


ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న దద్దాల దంపతులు

వెలిగండ్ల: మండలంలోని పెరుగుపల్లిలో పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని అమ్మవారికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ దంపతులు పొంగళ్లు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రజలందరికీ మేలు జరగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, స్వర్ణ ఏడుకొండలు, మాదిరెడ్డి వెంకటనారాయణరెడ్డి,, చిలకల నారాయణరెడ్డి, ఉండేల చిన వెంకటరెడ్డి, దద్దాల రాములు, దద్దాల తిరుపాలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పామూరు: మండలంలో గ్రామ గ్రామాన బీజేపీ సభ్యత్వనమోదు చేపట్టినట్లు కనిగిరి కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాజం చిన్న సుబ్బయ్య, సీఎస్‌పురం బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకట సత్యం పాల్గొన్నారు.

దేవస్థాన భూములు ఆక్రమిస్తే చర్యలు


దేవస్థాన స్థలంలో వేసిన రోడ్డును పరిశీలిస్తున్న ఈఓ, లేఅవుట్‌దారులు

పామూరు: దేవస్థాన భూములు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు అన్నారు. స్థానిక కందుకూరురోడ్డులో మదన వేణుగోపాలస్వామి దేవస్థానం సర్వే నంబర్ 176/2 లోని 13.86 ఎకరాల అర్చకమాన్యంలో అక్రమంగా రహదారి ఏర్పాటు చేశారని డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈఓ నరసింహబాబు రోడ్డును డోజర్‌తో చదును చేయించారు. దేవుని భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరమని, ఎవరైనా కొన్నా, అమ్మినా అవి చెల్లవని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణాచార్యులు, మాజీ చైర్మన్లు గుర్రం వెంకటేశ్వర్లు, కావేటి సుబ్బయ్య, పసుపులేటి రఘురాం, సిద్దవటం నరసింహ, పలువురు లేఅవుట్ దారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


కామేపల్లిలో భూమిపూజలో పాల్గొన్న నేతలు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కామేపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమిపూజ చేశారు. దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు, పుల్లయ్య, గాండ్ల హరిప్రసాద్, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైఎస్సార్ సీపీ నేతల సాయం

కందుకూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ మేరకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని డీడీ రూపంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు బుధవారం స్థానిక కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రజాప్రతినిధులను అభినందించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవాలనే లక్ష్యంతో ఆర్థిక సాయం అందించాలనే ఆలోచన ఉన్నతమైందని, ఇది మరికొంత మందికి స్ఫూర్తిని ఇస్తోందని అభినందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటూరి హరిబాబు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, ఇంటూరి మాధవరావు, గంగవరపు వెంకట్రావ్, కొండి కందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, గోసల వెంకారెడ్డి, కీర్తి చిరంజీవి, ఏకాంబరం విశ్వనాథం ఉన్నారు

వినాయక విగ్రహాల అనుమతులు సులభతరం


ఊళ్లపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు సులభతరం చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర అన్నారు. ఈ మేరకు ఊళ్లపాలెం గ్రామస్తులకు బుధవారం స్థానిక పంచాయతీ రోడ్డు సెంటర్‌లో అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ పద్ధతిలో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించి వెంటనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రజలు మద్యం, గంజాయి వంటి వాటికి దూరం గా ఉండాలని, విగ్రహాల వద్ద ఎటువంటి తగాదాలు జరిగినా విగ్రహ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు.

కొత్తవైర్లు వేయాలి


విద్యుత్ ఏఈ జిలానీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పామూరు: కాలంతీరిన విద్యుత్‌వైర్ల స్థానంలో కొత్త వైర్లు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఎం నాయకులు విద్యుత్ ఏఈ జిలానీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పామూరుతో పాటు మండలంలో పలు గ్రామాల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్‌లకు ఉన్న వైర్లు మెతక బారి కాలం తీరాయన్నారు. తరుచూ తెగిపడి ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయని, ప్రమాదాలు చోటుచేసుకోకుండా నివారించేందుకు తక్షణం లైన్లకు కొత్త వైర్లు వేయాలని, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట యాటా రాఘవేంద్ర, అల్లాబక్షు పాల్గొన్నారు.

842 బేళ్లు కొనుగోలు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 842 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి ఏ శ్రీనివాసరావు తెలిపారు. పొందూరు క్లస్టర్ పరిధిలోని రైతులు 917 బేళ్లను వేలానికి తీసుకురాగా 842 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 75 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.195, సరాసరి రూ.317గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): స్థానిక వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 1217 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలానికి నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1343 బేళ్లను తీసుకురాగా 1217 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 126 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.190, సరాసరి రూ.306.02 పలికింది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ విద్యానికేతన్ విద్యార్థుల దాతృత్వం


వరద బాధితులకు ఆర్థికసాయం అందజేసిన శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు

సింగరాయకొండ: వరద బాధితులను ఆదుకునేందుకు శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నడుం బిగించారు. బాధితులను ఆదుకునేందుకు రూ.30 వేలు వసూలు చేసి పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావుకు అందజేసారు. విద్యార్థుల దాతృత్వానికి వెంకటేశ్వరరావు తన వంతుగా రూ.60 వేలు కలిపి మొత్తం రూ.90 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవాభావం పెంపొందుతుందని కొనియాడారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా కె.అనూష బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పలు విభాగాల అధికారులు ఆమెకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీలోని సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె అన్నారు. నిన్నటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన కేవీ కృష్ణారెడ్డి బదిలీపై నగిరి మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మాధవీలత

కొండపి (సింగరాయకొండ): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ మాధవీలత అన్నారు. మండలంలోని చిన్నకండ్లగుంటలలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ టి.దీనకుమారి, ఎంపీహెచ్ఈఓ కాంతారావు, ఏఎన్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.